నవభూమి
పాలమూరు
అనుబంధం
11 సెప్టెంబర్,2024 బుధవారం పేజీలు:3
www.epaper.navabhoomi.in



# ఘనంగా కాళోజి జయంతి



**గద్వాల-నవభూమి** :కలాన్ని ఆయుధంగా మార్చి తన రచనలతో ప్రజలను చైతన్యం చేసిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి, ఆయన చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజీ స్ఫూర్తి తెలంగాణ సాంస్కృతిక ఉద్యమానికి మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంచార్జి బీసీ సంక్షేమశాఖ అధికారి రమేష్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన కవి**

తన కవిత్వంతో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలించిన ప్రజాకవి పద్మ విభూషణ్ శ్రీ కాళోజీ నారాయణరావు అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌బాబు, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, అమరవాయి కృష్ణారెడ్డి, శెట్టి ఆత్మకూర్ లక్ష్మన్, డీఆర్ శ్రీధర్, ఆనంద్, మాల శ్రీనివాసులు, తిమ్మోతి ఉన్నారు.

**స్ఫూర్తి ప్రదాత కాళోజీ**

తన రచనల ద్వారా ప్రజా చైతన్యానికి ఊపిరిలూదిన కాళోజి నారాయణరావు సామాజిక చైతన్య స్ఫూర్తి ప్రదాత అని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా కొని యాడారు. ప్రజాకవి కాళోజి జయంతిని పురస్కరించుకుని గద్వాల పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తెలుగు బాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలుగు విభాగం అధిపతి మేడిచర్ల హరినాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ జీకే చంద్రమోహన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రాధిక, అధ్యాప కులు సురేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాములు, ప్రశాంతి, టీఎస్‌కేసీ మెంటార్ సుబ్రమణ్యం ఉన్నారు.గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వీరన్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గత ఏడాది వార్షిక పరీక్షల్లో తెలుగు భాషలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థు లకు అధ్యాపకులు జి.శేఖర్, బోరవెల్లి పవన్‌కుమార్‌ల ఆధ్వర్యం లో బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకు లు బండ్ల దేవేందర్ రెడ్డి, సృజన, శేఖర్ నాయక్, కలి ముల్లా, బాలకృష్ణ, గీత, నరసింహులు, గోపి, వెంకటేశ్వర్లు, శిరీష, పరమేశ్వర్ రెడ్డి, కమల, అంజనమ్మ, సుకన్య, సూరిబాబు, పర్వీనా పాల్గొన్నారు.

# అత్యాచార కేసును జాప్యం చేయొద్దు

**గద్వాల-నవభూమి** : ఇటీవల ఇద్దరు దళిత బాలికల కిడ్నాప్, అత్యాచారం కేసులో జాప్యం లేకుండా నిందితులకు త్వరగా శిక్ష పడేలా చూడాలని డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ అధికారికి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఆయన పోలీస్ అధికారులతో కేసుపై సమీక్ష నిర్వహించారు. అలాగే ఈ నెల ఆరున జరిగిన లైంగిక దాడి కేసుపైనా సమీక్షించారు. ఇందుకు సంబంధించిన విషయాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు వివరించారు. గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీలతో కూడిన రేప్, పోక్సో కేసు నమోదైందన్నారు. ఇందులో ఒక యువకుడు, ఒక మైనర్ గద్వాల పట్టణంలోని ఓ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న ఇద్దరు బాలికలను వారి గ్రామ పొలిమేరల నుంచి మోటార్ సైకిల్‌పై కిడ్నాప్ చేశారని తెలిపారు. తర్వాత పట్టణ శివారులోని ఓ గదిలో బంధించి అత్యాచారానికి పాల్పడ్డారని చెప్పారు.మరుసటి రోజు మరో నలుగురితో కలిసి గ్రామంలో సంచరించి, బాధితుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేశారన్నారు. వారిపై అట్రాసిటీ, పోక్సో, రేప్ కేసులను నమోదు చేశామన్నారు. అనంతరం డీఐజీ చౌహాన్ మాట్లాడుతూ.. కేసు సున్నితత్వం,తీవ్రత దృష్ట్యా సూక్ష్మంగా పర్యవేక్షించాలన్నారు. పకడ్బందీగా లోతైన దర్యాప్తు కోసం,విజయవంతమైన ప్రాసి క్యూషన్‌నునిర్ధారిస్తూ వేధింపులకు పాల్పడిన వారికి వీలైనంత త్వరగా శిక్షలు పడేలా చూడాలని డీఎస్పీ సత్యనారాయణకు సూచించారు. ఇలాంటి కేసులలో జాప్యం లేకుండా విచారణ జరిపి, నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్, పోక్సో కోర్టు ద్వారా సత్వర న్యాయ విచారణ జరిపించి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. ఈ కేసులో ఉన్న నిందితులు మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డె తిరుమలేష్, గద్వాలకు చెందిన మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వారిలో ఉండగా.. వీరితో పాటు గద్వాలలోని దౌదర్‌పల్లికి చెం దిన కోరి గోపాల్, రెండో రైల్వే గేట్‌కు చెందిన తెలుగు నరేష్, శేరెల్లివీధికి చెందిన కమ్మరి నరసింహ, భవానీ నగ ర్‌కు చెందిన వడ్డ అభిషేక్‌లపైనా కేసులు నమోదు చేసినట్లు తెలి పారు.



## నార్లాపూర్ నిర్వాసితులకు

# న్యాయం చేయాలి



**కొల్లాపూర్-నవభూమి** : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నార్లాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన నిర్వాసితులందరికీ జీవో నెంబరు 120 ప్రకారం పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. రిజర్వాయర్‌లో ముంపునకు గురై భూములు, ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి హైదరాబాద్‌లోని జల సౌధలో సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సోమవారం కలిశారు. మంత్రి ఉత్తమ్‌కు నిర్వాసితుల సమస్యలను మంత్రి జూపల్లి వివరించారు. కొల్లాపూర్ మండలం బోడబండ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సున్నపు తండా, దుల్యానాయక్ తండా, అంజనగిరి తండా, వడ్డె గుడిసెల గ్రామాలకు చెందిన 117 మంది నిర్వాసితులకు జీవో నెంబరు 123 ప్రకారం కాకుండా జీవో నెంబరు 120 ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. వేర్వేరు జీవోలతో పరిహారం చెల్లించడంతో నిర్వాసితులు నష్టపోతున్నారని చెప్పారు.

**పాత చోటే ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేయాలి**

ప్రభుత్వం అటవీ భూముల్లో ఉన్న ఎల్లూరు, నార్లాపూర్ గ్రామాల నిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినా.. వారికి పరిహారం చెల్లించలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. నార్లాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ఎల్లూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 622, 623లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా కాలనీ ఏర్పాటు చేయడానికి గతంలో నోటిఫై చేశారన్నారు. గత ప్రభుత్వం సర్వే నెంబరు 371, 376లకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీని మార్చిందన్నారు. గతంలో మాదిరిగానే సర్వే నెంబరు 622, 623లలోనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని మార్చాలని మంత్రులను కోరారు. బోడబండ తండాలో ఇంకా మిగిలి ఉన్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, ఇతర నిర్వాసితుల మాదిరిగానే పునరావాసం ప్యాకేజీని వర్తింపజేయాలని.. బొల్లారం అటవీ భూముల్లో నివాసం ఉంటున్న శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు అక్కడే ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అటవీ శాఖకు ప్రత్యామ్నాయంగా వేరే చోట భూమి కేటాయించాలని నిర్వాసితులు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. నిర్వాసితులకు సాయం త్వరగా అందించేందుకు తనవంతు కృషి చేస్తానని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వారి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ పాటిల్ ప్రశాంత్ జీవన్‌ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంత్రి ఉత్తమ్‌ను కలిసిన వారిలో కొల్లాపూర్ మాజీ జడ్పీటీసీ హనుమంతు నాయక్, ఎల్లూరు మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, కొల్లాపూర్ సింగిల్ విండో డైరెక్టర్ రఘుపతిరావు, నార్లాపూర్ మాజీ ఎంపీటీసీ రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాములునాయక్ తదితరులు ఉన్నారు.



# 15 రోజులుగా బోర్ రిపేర్

## పాడి రైతుల ఫైర్



**మిడ్జిల్–నవభూమి** : పెండింగ్‌లో ఉన్న పాల బి ల్లులు వెంటనే చెల్లించాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మిడ్జిల్ మండలకేంద్రంలోని క ల్వకుర్తి– జడ్చర్ల ప్రధాన రహదారిపై పాడి రైతులు ధ ర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సుదర్శన్, రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండునెలలుగా పాల బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారంలోకి రాగానే పాల ప్రోత్సాహక ధరను రూ.5 పెం చుతామని చెప్పిన రేవంత్ ప్రభుత్వం నేటి వరకు ఎ లాంటి ప్రకటన చేయలేదన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తాసీల్దార్ రాజునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజే పీ నాయకులు నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, రవిగౌడ్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, బంగారు, మల్లయ్య, లాలు, జగన్‌గౌడ్ ,మోహన్, అంజి తదితరులు ఉన్నారు.

## కొండాపురంలో తాగునీటి ఎద్దడి



**కేటీదొడ్డి–నవభూమి** : కేటీదొడ్డి మండలంలోని కొం డాపురం గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో వారం రోజులు గా ఇదే పరిస్థితి ఏర్పడిందన్నారు. మిషన్ భగీరథ ద్వా రా గ్రామానికి తాగునీటిని అందించేవారు. అయితే కొన్ని వార్డులకు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆయా వార్డుల ప్రజలు తాగునీటి కోసం వ్యవసాయ బోర్లను ఆశ్రయించి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## పునరావాస కేంద్రంలో మౌలిక వసతుల కల్పన

**గట్టు–నవభూమి** : చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తామని గద్వాల ఆర్డీవో రామచందర్ అన్నారు. చిన్నోనిపల్లి ముంపు బాధితుల కోసం ఎర్రగట్టు వద్ద ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. వివిధ శాఖల పరిధిలో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. నిర్వాసితులకు అందించిన 360 ప్లాట్లకు హద్దులు చూపించారు. వివాదాలను అక్కడికక్కడే పరిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పెండింగ్ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిర్వాసితులకు భోజన వసతి కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయన వెంట గట్టు, మల్దకల్, ధరూరు తహసీల్దార్లు సరితారాణి, జుబేర్ హమ్మద్, వెంకట్రావ్, రాధాకృష్ణల పాటు అర్ఐలు, సర్వేయర్లు, సాగునీటి శాఖ అధికారులు, గట్టు ఎంపీడీవో చెన్నయ్య, ఎస్ఐ కేటీ మల్లేశ్ ఉన్నారు.



# గ్రామంలో మకాం వేసిన అధికారులు

**గట్టు–నవభూమి** : ఉన్న ఊరు వదిలి, చెట్టుకొకరు పు ట్టకొకరు అన్నట్లుగా చిన్నోనిపల్లి వాసులు ఊరు ఖాళీ చేసిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇప్పుడు తెల్లారి నట్లు ఉన్నది. ఆదివారం రిజర్వాయర్‌తోపాటు చిన్నోనిపల్లి ముంపు గ్రామాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సం దర్శించిన సంగతి తెలిసిందే. అయితే ఈ గ్రామస్తులు పడు తున్న కష్టాలపై నిత్యం మీడియాలో కథనాలు వస్తుండడం తో ఎమ్మెల్యే, తాసీల్దార్ లేఖలతో కలెక్టర్ బీఎం సంతోష్ స్పందించారు. అధికారులను నాలుగు టీంలుగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.గట్టు, ధరూర్, మల్దకల్, కలెక్టరేట్ 'ఎఫ్' సెక్షన్ తాసీల్దార్లు వరుసగా సరితారాణి, వెం కట్‌రావు, జుబేర్ అహ్మద్, రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీంల ను నియమించారు. ఒక్కో టీంలో ఎస్సైతోపాటు ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ముంపు గ్రామంతోపాటు పునరావాస కేంద్రాన్ని ఆర్డీవో రాంచందర్ ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించి ముంపునకు గురైన ఇండ్ల లెక్కను తేల్చారు. పునరావాస కేంద్రంలో ఇదివరకు పంపిణీ చేసిన ప్లాట్లలో పొజిషన్ ఎవరున్నారనే విషయాన్ని గుర్తించారు.విద్యుత్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు కూ డా గ్రామంలో మకాం వేసి పునరావాస కేంద్రానికి అవసరమయ్యే మౌలిక వసతులపై లెక్కలు వేశారు. కాగా గ్రామస్తులు,



నిర్వాసితుల కోసం అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అయితే స్థానికులు ఆందోళన చేస్తారనే ముందుచూపుతో గట్టు, ధరూర్, మల్దకల్, అయిజ ఎస్సైలు కేటీ మల్లేశ్, అబ్దుల్ షకూర్, సురేశ్, విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో పో లీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఊరును ఖా ళీ చేయించాలనే లక్ష్యంతోనే ప్రజాప్రతినిధులు, అధికారు లు అడుగులు వేస్తున్నారని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. ఇన్నాళ్లు పట్టించుకోకుండా ఇప్పుడే ఆగమేఘాల మీద అధికారులు రావడమేమిటని ప్రశ్నిస్తున్నారు. తమకు రావాల్సి న ప్రయోజనాలు ఇవ్వకుండా ఊరును ఖాళీ చేసే ప్రయత్నంలోనే వారు ఉన్నారని అనుమానం వ్యక్తం చేశారు.

# 15 రోజులుగా బోర్ రిపేర్

**గద్వాల–నవభూమి** : విద్యార్థులకు సైతం నీటి కష్టాలు తప్పడం లేదు. తల్లిదండ్రులు లేని వారు, బాలకార్మికులు, చదువు మధ్యలో మానేసిన చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి వారిని ప్రయోజకులుగా మార్చేందు కోసం జమ్మిచేడ్ సమీపంలో నిర్వహిస్తున్న అర్బన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. 4 నుంచి 8వ తరగతి వరకు ఇక్కడ 120 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. దీంతో నీటి అవసరాల కోసం వారు పడరాని పాట్లుపడుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామన్న అధికారులు పత్తా లేకుండాపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మరమ్మతులు మరిచారు..**

పాఠశాల ఆవరణలోని బోరు మోటర్ 20 రోజుల కిందట చెడిపోగా వార్డెన్ మరమ్మతులు చేయించారు. తర్వాత మళ్లీ రెండ్రోజులకే రిపేర్‌కు వచ్చింది. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి కూడా తీసుకెళ్లారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి.. నీటి సమస్యను తీరుస్తామని హామీ ఇ చ్చి వెళ్లినా నేటికీ మరమ్మతులు మాత్రం చేయలేదు. దీంతో పాఠశాలలో ఉన్న విద్యార్థులు ఉదయం నిద్ర లేవగానే సమీపంలో ప్రైవేట్ బోరును ఆశ్రయిస్తున్నా రు. అక్కడ నుంచి బకెట్ల ద్వారా



నీటిని పట్టుకొచ్చి స్నానాలు చేస్తున్నారు. ఇందుకోసం ముందు వెళ్లిన విద్యార్థులు బకెట్లతో వరుసగా నిలబడుతున్నారు.

**120 మందికి రెండే బాత్రూంలు..**

పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉండగా వీరందరికీ కలిపి పాఠశాల లోపల రెండు బాత్రూం లు మాత్రమే ఉన్నాయి. ఇవి విద్యార్థులకు ఏ మూల కూ సరిపోవడం లేదు. దీంతో చేసేది లేక అందరూ ఆరుబయట స్నానాలు చేయడంతోపాటు బట్టలు ఉ తుక్కుంటున్నారు. ఒకటికి,రెంటికీ ఆరు బయటకే వెళ్తున్నారు.ప్రహారీ లేకపోవడంతో రాత్రిళ్లు విషసర్పాలు,పగటి పూట పందులు సంచరిస్తున్నాయి.

**సమస్య విన్నవించినా ఫలితం శూన్యం?**

పాఠశాలలో 15 రోజులుగా నీటి ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారని విద్యార్థులతోపాటు అక్కడి వార్డె న్, విద్యాధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీ సుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి పాఠశాలను సందర్శించి సమస్యలు తె లుసుకొని వాటిని ఇప్పటి వరకు పరిష్కరించకపోవడంతో విద్యార్థులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. వెంటనే సమస్యలు పరిష్కరించి నీటి కొరత తీర్చడంతోపాటు ప్రహరీ, కిచెన్‌షెడ్ ఏర్పాటు, టాయిలెట్స్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

# వర్షాలు కురుస్తున్నా తప్పని తాగునీటి గోస

**మహబూబ్‌నగర్–నవభూమి:** వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నా.. విద్యాలయాల్లో నీటి గోస మాత్రం తీరడం లేదు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు పానీ కోసం పాట్లు పడుతున్నారు. బోరు మోటర్ చెడిపోవడంతో పాఠశాల ఆవరణలోని ప్రైవేట్ బోరు నీటితో 120 మంది అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇందుకోసం పొద్దుగాల లేచిందే తడువు బకెట్లు పట్టుకొని బోరు వద్ద బారులుదీరుతున్నారు.అలాగే అయిజ కేజీబీవీలో మోటర్ పనిచేయకపోవడంతో విద్యార్థినులు చేతిపంపును ఆశ్రయిస్తున్నారు. కేటీదొడ్డి మండలం కొండాపురంలో నీటికి కటకట ఏర్పడింది. కొన్ని వార్డులకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో తప్పని పరిస్థితుల్లో సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో నీటి కోసం విద్యార్థులు, ప్రజలు ఇక్కట్లు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇబ్బందులు పడుతున్నాం..**

పాఠశాలలో ఉన్న మోటర్ రిపేర్ చేయించి నా మళ్లీ కాలిపోయింది. దీంతో 15 రోజులుగా నీళ్ల కోసం అవస్థలు పడుతు న్నాం. అందరూ వచ్చి చూసి వెళ్తున్నారే తప్పా ఎవరూ సమస్యను పరిష్కరించడం లేదు. నిత్యం పాఠశాల సమీపంలోని బోరు వద్దకువెళ్లి వరుసలో నిలబడి నీటిని తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

**బాత్‌రూంలు లేక అవస్థలు..**

పాఠశాలలో 120 మంది విద్యార్థులకుగా నూ రెండు బాత్‌రూంలే ఉన్నాయి. విధిలేని పరిస్థితుల్లో సమీపంలోని బో రు మోటర్ వద్ద నీటిని తె చ్చుకొని ఆరుబయటే స్నా నాలు చేయడంతోపాటు బట్టలు ఉతుక్కుంటున్నాం. మలవిసర్జనకు కూడా బయటకు పోవాల్సిందే. పగలు ఇబ్బం ది లేదు. రాత్రివేళ పాఠశాల ఆవరణలో పా ములు సంచరిస్తుండడంతో బయటకు రావాలంటేనే భయం వేస్తుంది. అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలి.



## నిర్విఘ్నంగా సభ్యత్వాల నమోదు



**గద్వాల-నవభూమి** : వినాయకుడి ఆశీస్సులతో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిద్దామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ పార్టీ శ్రేణులకు సూచించారు. గద్వాల పట్టణంలోని 36వ వార్డులో సోమవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురు నాయకులకు డిజిటల్ మెంబర్‌షిప్ కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం కోసం ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చే స్వభావం బీజేపీకి లేదన్నారు. జూటాకోర్ మాటలు చెప్పి అధికారం దక్కించు కున్న కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీసే రోజు వస్తుందన్నారు. దేశ అభివృద్ధి, భవిష్యత్ తరాల కోసం బీజేపీ అవసరాన్ని ప్రజలకు వివరించి అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు జరిగేలా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కౌన్సిలర్ రజకజయశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు పోతుగంటి భరత్‌ప్రసాద్, డీకే స్నిగ్ధారెడ్డి, కార్యక్రమ ఇన్‌చార్జి శ్రీకాంత్, రామాంజనేయులు, రవికుమార్ ఎగ్బోటే, బండల వెంకట్రాములు, బలిగెర శివారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్లు టపాల కృష్ణవేణి, బండల పద్మావతి, కౌన్సిలర్లు కుమ్మరి శ్రీను, అనిత, నాయకులు దేవదాస్‌నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, మా లిం ఇసాక్, పాల్వాయి రాముడు, నాగప్ప, బాలేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

**వనపర్తి-నవభూమి** : రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి గణపతిని వేడుకున్నారు. వినాయక చవితి నవరాత్రి పూజలో భాగంగా చిన్నారెడ్డి పట్టణంలోని 28వ వార్డు వెంగ ళరావునగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపానికి ఓబీసీ చైర్మన్ కోట్ల రవి ఆహ్వానం మేరకు పాల్గొని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొ దటి పూజలు అందుకునే గణనాథుడి వేడుకలను జిల్లాలో కులమతాలకతీతంగా భక్తిశ్రద్ధల తో జరుపుకోవడం ఇక్కడి ప్రజల ఐక్యతను చాటి చెబుతుందన్నారు. మండపాలను ఎంతో సుందరంగా ముస్తాబు చేసుకున్న నిర్వాహకులు అంతే సంతోషంగా నిమజ్జనాన్ని కూడా జరుపుకోవాలని సూచించారు. అనంతరం గణేష్ ఏర్పాటు కమిటీ సభ్యులు రుద్ర యూత్ ఆ ధ్వర్యంలో చిన్నారెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ కోట్ల రవి, శిరీష, కిరణ్‌కుమార్, చీర్ల జనార్దన్, జానంపేట నాగరాజు, రుద్ర యూత్ కమిటీ సభ్యులు, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## జీతం ఇవ్వలేదని కార్మికుడి ఆత్మహత్యాయత్నం



**బిజినేపల్లి-నవభూమి** :జీతం ఇవ్వలేదని నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన సూరంపల్లి బాలపీరు (57) అనే పంచాయతీ పారిశుధ్య కార్మికుడు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు అల్లీపూర్ గ్రామ పంచాయతీలో అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా బాలపీరు కొంతకాలంగావిధులు నిర్వహిస్తున్నాడు. నెలకు రూ. 8500 చొప్పున ఏడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. జీతం ఇవ్వాలని పలుమార్లు పంచాయతీ కార్యదర్శినికోరాడు.జీతం ఇవ్వడంలేదని రెండు నెలల నుంచి విధులకు కూడా హాజరుకావడం లేదు. ఈక్రమంలో తోటి కార్మికులందరికీ జీతాలు చెల్లించి తనకు మాత్రం ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన బాలపీరు సోమవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముందే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గమనించిన తోటి కార్మికులు వెంటనే అతన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్ప త్రికి తరలించారు. అతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

### అద్దె చెల్లించలేదని..

# గురుకుల భవనానికి తాళం

**వనపర్తి-నవభూమి** : జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాల, డిగ్రీ కళాశాలల అద్దె బకాయిలు చెల్లించలేదని భ వన యజమానులు సోమవారం ప్రధాన గేటుకు తాళం వేశారు. ఉపాధ్యాయులు, అ ధ్యాపకులను లోపలికి అనుమతించలేదు.నాగవరం వద్ద ఉన్న అనూస్ ప్రైవేట్ భవనం లో పెద్దమందడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 618 మంది, మహిళా డిగ్రీ కళాశాలలో 400 మందితో నిర్వహిస్తున్నారు. అ యితే, ఎనిమిది నెలలుగా బిల్డింగ్‌కు అద్దె బ కాయి ఉండడంతో యజమాని ఆగ్రహం వ్య క్తం చేశాడు. హాస్టల్‌లో విద్యార్థులు ఉండగా గేటు బయట ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉ పాధ్యాయులు నిలిచిపోయారు. చాలాసేపటి తర్వాత అక్కడ పనిచేసే వర్కర్స్ ఉపాధ్యాయులకు కుర్చీలు అందజేశారు.పాఠశాల భ వనానికి సంబంధించి నెలకు రూ.3 లక్షలు (8 నెలలకు రూ.24 లక్షలు), కళాశాల భవనానికి నెలకు రూ.4,50,601 (8 నెలలకు రూ.36,04,808) చొప్పున బకాయిలు చెల్లించకుంటే గేట్లు తాళం తీసేది లేదని తేల్చిచెప్పాడు. చివరకు ప్రిన్సిపాల్ జోక్యం చేసుకొని సంబంధిత అధికారులతో యజమానిని



మాట్లాడించారు. బిల్లులు త్వరగా చెల్లిస్తామ ని హామీ ఇవ్వడంతో మధ్యాహ్నం 12 గంట ల సమయంలో గేటు తెరిచాడు. అప్పటి దా కా విద్యార్థులు బోధనకు దూరమయ్యారు.

# కేజీబీవీలో కటకట

**అయిజ-నవభూమి** : అయిజ పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో తాగునీటికి కటకట ఏర్పడింది. పాఠశాలకు సరఫరా చేసే బోరు మోటారు వారం కిందట కాలిపోయింది. మోటర్‌కు మరమ్మతు చేయపోవడంతో విద్యార్థినులకు పాఠశాల ఆవరణలోని చేతిపంపు నీరే ఆధారమైంది. ఈ విషయమై ప్రత్యేకాధికారి చెన్న బసమ్మ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో విద్యార్థినులు వారం రోజులుగా ఇబ్బందులు పడుతున్నా రు. మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికీ పట్టుకునేందుకు ఎక్కువ సమ యం అవుతున్నది.బోరు మోటార్ నీరు నేరుగా బాత్ రూంలకు స ప్లై ఉండడంతో స్నానాలు తొం దరగా చేసేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం బోరు మోటార్ పనిచేయకపోవడంతో బకెట్లతో చేతి పం ప్‌నీరు పట్టుకొని కాలకృత్యాలు, స్నానాలు, దుస్తుల శుభ్రతకు వినియోగిస్తున్నా రు. చేతిపంపు వ ద్ద గంటల తరబడి నిల్చొని నీరు పట్టుకుంటున్నట్లు విద్యార్థినులు తెలిపారు. చేతి పంప్ వద్ద నిల్చుండడంతో తరగతులకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినులు నిరసన తెలుపగా, బీఆర్‌ఎస్వీ నాయకులు మద్దతు ప్రకటించారు.

**ప్రభుత్వ అసమర్థతతోనే తిప్పలు.. : కురువ పల్లయ్య**

ప్రభుత్వ అసమర్థతతో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు తిప్పలు పడుతున్నారని బీఆర్‌ఎస్వీ జిల్లా నా యకుడు కురువ పల్లయ్య ఆరోపించారు. సోమవారం కేజీబీవీ పాఠశాలకు చేరుకొని పాఠశాల సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.



కాంగ్రెస్ ప్ర భుత్వం విద్యపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదువుకునే విద్యాసంస్థలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదన్నారు. వారం రోజులుగా నీటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేజీబీవీ పాఠశాలలో నీటి వసతి కల్పించడంతోపాటు అవసరమైన సబ్జెక్టులకు ఫ్యాకల్టీ లేదని, దీంతో విద్యార్థినుల విద్యాభ్యాసం కూడా కుం టుపడుతుందన్నారు. కలెక్టర్ వెంటనే కేజీబీవీకి నీటి వసతితోపాటు ఫ్యాకల్టీని ఏర్పాటు చేయాలని డిమాం డ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు మ ల్లి, రాజు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణనాథులు

**గద్వాల-నవభూమి** : ఉత్సవకమిటీలు, యూత్ కమిటీల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా కొలువుదీరిన గణపయ్యలు సోమవారం గంగమ్మ ఒడికి చేరాయి. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. సోమవారం విగ్రహాలను నిమజ్జనానికి పట్టణ సమీపంలోని కృష్ణానదికి తరలించారు. ఈ సందర్భంగా తెలుగుపేట మండపం వద్ద నిర్వహించిన పూజల్లో కౌన్సిలర్ శ్రీను ముదిరాజ్ పాల్గొన్నారు. రాధాకృష్ణ కాలనీలో కొలువుదీరిన గణపతికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ టపాల కృష్ణవేణి, రామాంజనేయులు దంపతులు, నాయకులు రవి ఎగ్బోటే, దేవదాసు నాయుడు పూజలు చేశారు. పద్మావతి అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం నిమజ్జనానికి తరలుతున్న సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో మహిళల కోలాట నృత్యం అందరినీ ఆకట్టుకున్నది.అయిజలో కొలువు దీరిన గణనాథులు సోమవారం సాయంత్రం నిమజ్జనానికి తరిలారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆర్డీఎస్ ప్రధాన కాలువలో, తుంగభద్రానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.ఉండవల్లి మండలంలోని తక్కశిల, కంచుపాడు, వీఆర్ కాలనీలో కొలువైన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్ర భజనలు, చిన్నారుల కేరింతలు, యువకుల నృత్యాలతో ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం కృష్ణ, తుంగభద్ర నదుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల నుంచి తరలివచ్చిన గణపతి విగ్రహాలను ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి క్షేత్రం సమీపంలోని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.మానవపాడు మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు తయారు చేసి, ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్దవాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి గోమతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

